## మినీకథ

# ఊర్మిళాదేవి నిద్ర

జి. పద్మినీప్రసాద్



అంతా ఆశ్చర్యపోతూనే, ఆనందంగా దీవించి అక్షింతలు వేశారు. వారి ఆశ్చర్యానికి కారణం వధువు ఊర్మిళ, వరుడు లక్ష్మణరావు. వారికి వైభవంగా వివాహం జరిగింది.

లక్ష్మణరావుకి తల్లిదండ్రులు లేరు. అక్కా, బావతో పెళ్ళి జరిపించారు. అక్క కళ్యాణికి లక్ష్మణరావంటే పంచ ప్రాణాలూను.

శోభనం నాటి రాత్రి ఊర్మిళతో అంది కళ్యాణి- చూడమ్మా! మీ ఆయన నా తమ్ముడే కాదు. నా బిడ్డలాటి వాడు. ఎంతో నిదానస్థుడు. మంచివాడు. మీరిద్దరూ చిలకా గోరింకల్లా జీవించాలి. మరొక సంగతి చెప్పాలి. వాడు ఎంత మంచివాడో కోపం వస్తే అంత మొండివాడు. సాధారణంగా కోపం రాదనుకో. ఏది ఏమైనా నువ్వు ఎంతో మెలకువగా వుండాలి.'' అంది. ''మరి నిద్రవస్తేనో'' అడిగింది ఊర్మిళ.

ఈ జోక్‌కి నవ్వాలో, ఏడ్వాలో అర్థం కాలేదు కళ్యాణికి. ''పద్మా! నీకోసం మీ ఆయన ఎదురు చూస్తున్నాడు.'' అంటూ ఆమెను గదిలోకి పంపి తలుపులు వేసింది.

లక్ష్మణరావు ఊహాగానాలకు 'బ్రేక్' పడింది. భార్యతో ఎలా మాట్లాడాలి, ఎలా నవ్వించాలి, ఎలా ప్రవర్తించాలి అనే విషయమై తీవ్రంగా ఆలోచిస్తూ, ఊర్మిళను చూడగానే సాదరంగా నవ్వుతూ ఆహ్వానించాడు.

అందరిలా ఊర్మిళ సిగ్గు పడలేదు. కనీసం చిరు నవ్వు కూడా నవ్వలేదు. గది అలంకరణ మొత్తం పరికించి చూసింది. ''మంచంపైగా సీలింగ్ ఫ్యాన్ వుంటే బాగుండేది.'' అంది.

ప్రక్కనే ఒక స్టూలు మీద తాతల కాలంనాటి టేబుల్ ఫ్యాన్ వుంది. 'మొదటి రాత్రి సంభాషణలు యిలాగే మొదలవుతాయి కాబోలు' అనుకున్నాడు లక్ష్మణరావు.

''అవును నేను అదే అనుకున్నాను. ప్రస్తుతానికిది సరిపెట్టుకొందాం.'' అంటూ టేబుల్ ఫ్యాన్ స్విచ్ 'ఆన్' చేసాడు. పెద్ద శబ్దం చేస్తూ తిరగనారంభించింది.

''నేను మంచం మీద కూర్చొంటాను.'' అంటూ ఫ్యాన్ గాలి తగిలేలా మంచంపై కూర్చుంది.

తను వేసుకొన్న రిహార్సల్స్‌లో భార్యను దగ్గరుండి బుజ్జగిస్తూ మంచం వైపు నడిపించుకురావడం, ఆమె సిగ్గుపడటం, తనుధైర్యం చెప్పి మంచం మీద ఆసీను రాల్ని చేయడం యిత్యాదులు వున్నాయి. కాని, యిక్కడ మరోలా జరిగింది.

''నీ అభిరుచులు తెలుసుకోవాలని వుంది.'' అన్నాడు నవ్వుతూ లక్ష్మణరావు నెమ్మదిగా ఆమె ప్రక్కనే కూర్చుంటూ.

''అన్ని రుచులూ నాకిష్టమే. ఆ జాంగ్రీ ఒకటి యివ్వండి.'' అంది ఊర్మిళ.

విస్తుపోయాడు లక్ష్మణరావు వింతగాచూసి. ఒక జాంగ్రీ అందించాడు. నోట్లో వేసుకొని ''చాలా బాగుంది.'' అంది. ''ఊర్మిళా, ఈ మొదటి రాత్రి ఇన్ని స్వీట్స్ ఎందుకు పెడతారోనీకుతెలుసునా?'' కొంటెగా అడిగాడు.

''బహుశా మళ్ళీ మళ్ళీ పెట్టే అవకాశం వుండదేమోనని.'' అంది. ఈసారి నవ్వక తప్పలేదు. మళ్ళీ — 'ఎన్ని జోకులేస్తుందో' అనుకున్నాడు. కాని, ఊర్మిళ నవ్వలేదు. జాంగ్రీ మొత్తం తినేసింది.

''మన కొత్త కాపురానికి ఈరోజు తొలి రోజు. కష్ట సుఖాలు కలసి పంచుకోవాలనే సిద్ధాంతం మీద యీ పాలు చెరిసగం తాగుదాం. ముందు నువ్వు.'' అంటూ పాలగ్లాసు అందించాడు.

ఆమె గ్లాసెత్తి గడగడ మొత్తం తాగేసింది.

లక్ష్మణరావుకు మతిపోయింది. కోపం రాబోయింది. కాని, తమాయించుకొన్నాడు. కారణం ఆమె కొత్త పెళ్లాం! ''నాకు మిగల్చలేదన్న మాట. పోనిలే, నీ ఆనందమే నా ఆనందం. పాలు బాగున్నాయా?'' అంటూ మందహాసం చేశాడు. ''చక్కెర తక్కువైంది. అయినా గ్లాసెడు పాలు నిద్రబోయేముందు తాగితే ఆరోగ్యానికి మంచిదంటారు.''

''మనం నిద్ర బోవటంలేదుగా.'' అన్నాడు లక్ష్మణరావు.

''ఏమో బాబు, నాకు నిద్ర ముంచుకొస్తూంది.'' అంటూ వెనక్కి వాలి కళ్ళు మూసుకొంది.

''ఏయ్ కొంటె పిల్లా! నన్నల్లరి పట్టించాలనా నీ ఉద్దేశ్యం? అదేం కుదరదు. ఇటు చూడు.'' అంటూ తట్టి పిలిచాడు.

ఆమె పలకలేదు. గాఢమైన నిద్రలోకి జారుకొంది.

****

ఈ సంఘటన ఆ రోజు మాత్రమే జరగలేదు.

వరుసగా ప్రతి రోజు కూడా దాదాపు యిదే తంతు. పడక మంచం చూడగానే ఆమెకు నిద్రముంచుకొస్తుంది. లక్ష్మణరావు బాధ పడ్డాడు. జుత్తు పీక్కొన్నాడు. గోల పెట్టాడు. ఏం చేయాలో అర్థంకాక కళ్యాణికి చెప్పుకొన్నాడు.

ఆమె అంతా వింది. మొదట విచిత్రంగా అన్పించినా ఊర్మిళ తంతు అర్థంకాలేదు. పోనీ తప్పుపడదామంటే ఆమె ప్రవర్తనలో ఎటువంటి లోటు లేదు. ఇక లాభం లేదని ఆమెనే అడిగింది. ''నువ్వు పడక గదిలోకి వెళ్ళగానే నిద్రపోతున్నావని మీ ఆయన బాధపడుతున్నాడు. అసలు ఇదేం అలవాటు నీకు?'' అంది. ''నాకు చిన్నప్పటినుండి పెందలకడనే భోజనం చేసి నిద్రపోవడం అలవాటు. అది తప్పా'' అంది అమాయకంగా.

ఆమె సమాధానం విని చిన్నగా నవ్వింది కళ్యాణి. దీని పరిష్కారం ఆమెకు వెంటనే గోచరించింది. వెంటనే అమలుచేయాలనుకొంది.

****

''ఊర్మిళా! తొందరగా భోజనం చేసి పడుకోమ్మా! మీ ఆయన సినిమాకుపోతాట్ట.'' అంది కళ్యాణి. ''సరే'' నంది ఊర్మిళ.

అదే సమయంలో లోపలకువచ్చింది రాణి. ఎదురింటి వారి అమ్మాయి. వన్నెల విసనక్రరలా అలంకరించుకొంది. ''ఏమిటి వదినా, బావయింకాతయారుకాలేదు! పిక్చర్‌కి టైం అవుతోంది. ''బావా ఓ బావా'' అంటూ బిగ్గరగా పిల్చింది.

దుస్తులమీద సెంట్ 'స్ప్రే' చేసుకొంటూ బైటకు వచ్చాడు లక్ష్మణరావు. ''హల్లో రాణి, వచ్చేశావా!'' అంటూ ఆమె దుస్తుల మీద కూడా బలవంతంగా సెంట్ పూశాడు.

''యూనాటీ! చూడు వదినా. బావ చిలిపిపన్లు'' అందిగోముగా. ''ఇక్కడే యిలా అంటున్నావు. ఇక సినిమాహాల్లో వాడి ఆగడాలకు ఏంతట్టుకొంటావమ్మా. వాడసలే అల్లరివాడు'' అరిది నవ్వుతూ కళ్యాణి. లక్ష్మణరావు రాణి నెత్తిమీద మొట్టికాయ వేశాడు.

బైట రిక్షా బెల్ విన్పించింది.

''అక్కా, మేం వెళ్తాం! ఊర్మిళా నీకు టైమయ్యిందిగా, పడుకో మేం సెకండ్ షోకి వెళ్లి వస్తాం.'' అంటూ రాణి భుజం మీద చేయివేసి బైటకు నడిచాడు. నవ్వుతూ చూస్తూండి పోయింది కళ్యాణి.

ఊర్మిళ మనసులో కలుక్కుమంది. కళ్ళలో నీరు తిరిగింది. అంతే! ఆ రోజు మొదలు ఆమె 'నిద్రా దేవత'ను నిర్దాక్షిణ్యంగా పారద్రోలింది. భర్తకు దగ్గరయ్యింది.